

హైదరాబాద్ వార్త


# రెచ్చిపోతున్న హ్యాకర్స్



**ఎపికె ఫైల్స్ పంపి దోచేస్తున్న సైబర్ నేరగాళ్లు**

**డేటా చోరీ చేసి ..ఆపై బ్లాక్‌మెయిల్**

**నగరంలో కలకలం రేపుతున్న వరుస ఘటనలు**

**ఫేస్‌బుక్, ట్విటర్, ఇన్‌స్ట్రాగ్రాం అకౌంట్లు హ్యాక్**

**ప్రభుత్వ, ప్రైవేట్ వెబ్‌సైట్‌లనూ వదలని నేరగాళ్లు**

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న సైబర్ క్రైం పోలీసులు**

**హైదరాబాద్, నవంబరు 23,ప్రభాతవార్త**

ఫేక్‌బుక్, ట్విటర్, ఇన్‌స్ట్రాగ్రామ్ అకౌంట్లను హ్యాక్ చేస్తూ వ్యక్తిగత వివరాలు చోరీ చేసి బ్లాక్ మెయిల్‌కు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్లు నగరంలో రెచ్చిపోతున్నారు. వివిధ అకౌంట్ల ద్వారా ఆకర్షణీయమైన ఫొటోలతో నకిలీ యుఆర్‌ఎల్‌ను పంపిస్తున్నారు. సదరు యుఆర్‌ఎల్‌ను క్లిక్‌చేస్తే వెంటనే ఆయా ఖాతాలను పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుంటున్నారు. ఆ తర్వాత పాస్‌వార్డ్ మార్చేసి అందులో ఫొటోలను సేకరించి బ్లాక్ మెయిల్‌లకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా సైబర్ నేరాలపై అవగాహన లేని అనేక మంది ఈ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకుంటున్నారు. ముఖ్యంగా ఫేస్‌బుక్, ట్విటర్, ఖాతాకు లాక్ వేయని వారు మాత్రమే సైబర్ నేరగాళ్లకు సులువుగా దొరుకుతున్నారు. ఒకసారి ఖాతా హ్యాక్ అయితే ఫోన్‌లోని సమాచారంతోపాటు, వాట్సాప్ కాంటాక్ట్ లిస్ట్, ఫోన్ కాంటాక్ట్ లిస్ట్ గ్యాలరీలోని కుటుంబసభ్యులతో సహా హ్యాకర్ల చేతికి వెళ్లిపోతాయి. అసభ్యకరమైన ఫొటోలను ఖాతాలో పోస్టు చేయడం, మీరు అడినట్లే బంధువులు, స్నేహితులకు మెసేజ్‌ల ద్వారా డబ్బులు అప్పుగా అడటం వంటివి చేస్తున్నారు. విషయం తెలుసుకులేని కొందరు ఖాతాదారులు హ్యాకర్లకు లొంగిపోతున్న సంఘటలను వెలుగుచూస్తున్నాయి. తాజాగా ఆదివారం ఎస్‌బీఐ ఆధార్ అప్‌డేట్‌పేరుతో పలు మీడియా గ్రూపులు, మంత్రుల అధికారిక గ్రూపులను హ్యాకర్ల తమ నియంత్రణలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. మంత్రుల పీఆర్వోల ఫోన్లు, జర్నలిస్టుల ఫోన్లూ హ్యాక్ అయ్యాయని సందేశాలు వస్తున్నాయి.

**ఏపీకే మోసం అంటే?**

ఆండ్రాయిడ్ అప్లికేషన్ ప్యాకేజీ (ఏపీకే) ద్వారా సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నట్టు ఎస్బీఐ, ఐసీఐసీఐ, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు తమ ఖాతాదారులను హెచ్చరిస్తున్నాయి. ఆండ్రాయిడ్ ఎకోసిస్టమ్..తమ యూజర్లు ప్లే స్టోర్ నుంచి థర్డ్ పార్టీ మొబైల్ యాప్స్‌నూ ఇన్‌స్టాల్ చేసుకొనేందుకు అనుమతిస్తుంది. ఈ వెసులుబాటే ఆండ్రాయిడ్ యూజర్లను హ్యాకర్లు దోపిడీ చేసేందుకు కలిసొస్తున్నది. ఏపీకే లేదా ట్రోజనైజింగ్ ద్వారా ఓ చట్టబద్ధమైన యాప్ ఇన్‌స్టాల్ చేసి యూజర్లను బురిడీ కొట్టిస్తున్నారు. దీనిపై ఎస్బీఐ తమ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఎస్‌బిఐ రివార్డు పాయింట్లను రిడీమ్ (గెల్చుకోవడం లేదా పొందడం) కోసం వాట్సాప్ లేదా ఎస్‌ఎంఎస్ ద్వారా బ్యాంక్ ఖాతాదారులకు మోసగాళ్లు ఏపీకేలు పంపిస్తున్నారు. దయచేసి గుర్తుంచుకోండి ఎస్బీఐ ఎప్పుడూ ఏ లింకులు లేదా ఏపీకేలనూ వాట్సాప్, మెసేజ్‌ల ద్వారా ఖాతాదారులకు పంపించదు. వాటిపై క్లిక్ చేయవద్దు. గుర్తుతెలియని ఫైల్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవద్దు అని పోస్ట్ చేసింది. ముఖ్యంగా బ్యాంక్ ఖాతాదారులు తమ స్మార్ట్‌ఫోన్లలో హానికరమైన ఏపీకేలను ఇన్‌స్టాల్ చేసుకోవడం ద్వారా హ్యాకర్ల ఉచ్చులో తొలుత చిక్కుకుంటారు. ఈ ఏపీకేలను ఇన్‌స్టాల్ చేసుకునేలా మోసగాళ్లు రకరకాల ఇంజినీరింగ్ వ్యూహాలనూ అమలు చేస్తూ ఉంటారు. ఏపీకేపై క్లిక్ చేసి ఇన్‌స్టాల్ చేసుకున్నప్పుడు ఇది ప్రమాదం అంటూ ఎన్నో గుర్తుతెలియని సందేశాలు వెంటవెంటనే మొబైల్‌కు వస్తాయి. ఇందులో కెమెరా, మైక్రోఫోన్, లొకేషన్, కాంటాక్ట్స్, ఎస్ఎంఎస్ తదితర అనుమతులు అవసరమనికూడా ఉంటుంది. అన్ని అనుమతులూ ఇస్తూ మొబైల్ వినియోగదారులు ఏపీకేను ఇన్‌స్టాల్ చేసుకుంటే.. హ్యాకర్లు తమ హ్యాకింగ్ డివైజ్‌లపై సదరు మొబైల్‌ఫోన్‌ను గుప్పిట్లోకి తీసుకుంటారు. ఆపై మీ విలువైన, రహస్య సమాచారం వారి చేతుల్లోకి వెళ్లిపోతుంది. క్షణాల్లో మీకు సంబంధించిన అన్ని ఖాతాల నుంచి నగదును మాయం చేసేస్తారు.

**పోలీసుల ప్రత్యేక దృష్టి...**

ప్రముఖుల ఫోన్లు, వాట్సాప్ గ్రూప్‌లు లక్ష్యంగా చేసుకుని హ్యాకర్లు రెచ్చిపోతుండడంతో సైబర్ పోలీసులు రంగంలోకి దిగారు. హ్యాకింగ్‌కు పాల్పడుతున్న వారిని గుర్తించే పనిలో పోలీసులు పడ్డారు. గతంలో, ప్రస్తుతం హ్యాకింగ్ చేస్తుండడంతో దీన్ని పోలీసులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. హ్యాకర్ల ఆటకట్టించేందుకు ఐపీఅడ్రస్‌లు కనుక్కునే పనిలో పడ్డారు. అయితే హ్యాకింగ్ సరదాకు చేస్తున్నారా? లేదా వారి వెనుక ఎవరైనా అసాంఘిక శక్తులు ఉన్నారా అని ఆరా తీస్తున్నారు. పటిష్ట భద్రత కలిగే వారి ఖాతాలే హ్యాక్ అవుతుండడంతో పోలీసులను కలవరపరుస్తోంది. త్వరలోనే నిందితులను పట్టుకుని హ్యాకర్ల ఆట పట్టిస్తామని సైబర్ పోలీసులు చెబుతున్నారు.

# రేపు జిహెచ్ఎంసి కౌన్సిల్ మీటింగ్

* వ్యూహా ప్రతివ్యూహాల్లో అధికార విపక్షపార్టీలు
* ప్రజాసమస్యలపై నిలదీసేందుకు బిఆర్ఎస్-బిజెపి సన్నదం
* విపక్షాల దాడికి చెక్ పెట్టేలా అధికార కాంగ్రెస్ ప్రణాళికలు




జిహెచ్ఎంసి కౌన్సిల్

**హైదరాబాద్, నవంబరు 23,ప్రభాతవార్త**

జీహెచ్ఎంసీ పాలకమండలి కౌన్సిల్ మీటింగ్ రేపు జరగనుంది. మేయర్ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశం ఈ పాలక మండలి చివరి సమావేశం అయి ఉండవచ్చునని పలువురు సభ్యులు వ్యాఖ్యానిస్తుంగా.. వచ్చే జనవరిలో మరోసారి వార్షిక బడ్జెట్‌పై సమావేశమయ్యే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. 25న జరగనున్న కౌన్సిల్ సమావేశం రోజునే పాలక మండలి, సభ్యుల ఫొటో షూట్ కార్యక్రమాన్ని నిర్వహించి, జనవరిలో బడ్జెట్‌పై జరగనున్న చిట్టచివరి కౌన్సిల్ సమావేశంలో సభ్యులకు ఫొటోలను పంపిణీ చేయాలని అధికారులు భావిస్తున్నారు. 2020 డిసెంబర్ ఎన్నికల్లో గెలిచి, 2021 ఫిబ్రవరిలో కొలువుదీరిన ఈ పాలక మండలి గడువు వచ్చే ఫిబ్రవరి 10వ తేదీతో ముగియనుండటంతో 25న జరగనున్న కౌన్సిల్ సమావేశంలో గడిచిన అయిదేళ్లలో నగరంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులపై, పరిపాలన పరంగా తీసుకువచ్చిన సరి కొత్త సంస్కరణలపై అధికార పార్టీ సభ్యులతో పాటు ఇతర పార్టీల వారిగా సభ్యులకు మాట్లాడే అవకాశమివ్వనున్నట్లు తెలిసింది. సమావేశానికి సంబంధించి ఇప్పటికే జీహెచ్ఎంసీ సెక్రటరీ సెక్షన్ కార్పొరేటర్ల నుంచి సుమారు 95 ప్రశ్నలను స్వీకరించినట్లు సమాచారం. ఉదయం పదిన్నర గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో మేయర్ ప్రసంగం, ప్రశ్నోత్తరాల పర్వం వంటివి నిర్వహించనున్నట్లు తెలిసింది. హెచ్ సిటీ పనులు, ఎస్ఆర్ డీపీ పనులు, దశాబ్దాలుగా వివాదంగా ముడిపడి ఉన్న ప్రధాన కార్యాలయంలో పరిష్కారమైన విగ్రహాల పంచాయతీతో పాటు స్ట్రీట్ లైట్ల మెరుగైన నిర్వహణకు తీసుకున్న నిర్ణయాలు, ఇటీవల ప్రారంభించిన ఇందిరమ్మ బ్రేక్ ఫాస్ట్ క్యాంటీన్లతో పాటు ఈ సారి బతుకమ్మకు గిన్నీస్ రికార్డు ఆఫ్ వరల్డ్ లో స్థానం దక్కటం వంటి అంశాలు ప్రస్తావనకు వచ్చే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా దీర్ఘకాలంగా పరిష్కారం కానీ సమస్యలపై గళం విప్పేందుకు మజ్లీస్‌పార్టీ సిద్దమవుతుండగా, అధికార పార్టీని ఇరకాటం పెట్టేందుకు కమలనాథులు వ్యూహాన్ని సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశానికి హెచ్ఎండీఏ, అడిషనల్ కలెక్టర్లను కూడా ఆహ్వానించాలన్న అంశంపై ఇటీవలే ప్రధాన కార్యాలయంలో నిరసన చేపట్టిన బీజేపీ ఈ నెల 25వ తేదీన కౌన్సిల్ లో ఇదే విషయంపై గట్టిగా ప్రశ్నించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. బీఆర్ఎస్ పార్టీ కూడా ప్రజాసమస్యలపై నిలదీసేందుకు ఇప్పటికే ప్రశ్నలను సమర్పించినట్లు తెలిసింది.

**బడ్జెట్‌పై చర్చకు ఛాన్స్...**

రానున్న ఆర్థిక సంవత్సరం (2026-27) కు సంబంధించిన జీహెచ్ఎంసీ వార్షిక బడ్జెట్ పై ప్రస్తుతం అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ సారి బడ్జెట్ రూ. 10 వేల కోట్లు దాటే అవకాశమున్నందున, బడ్జెట్ రూపకల్పనకు సంబంధించి అన్ని పార్టీల సభ్యుల అభిప్రాయాలు తీసుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. మున్సిపల్ యాక్టు 1959 ప్రకారం నవంబర్ 10 లోపు స్టాండింగ్ కమిటీ, డిసెంబర్ 10 లోపు బడ్జెట్‌ను ఆమోదించి తదుపరి ఆమోదం కోసం సర్కారుకు పంపాల్సి ఉన్నందున రేపు జరగనున్న కౌన్సిల్ సమావేశంలో బడ్జెట్ పై లఘు చర్చకు అవకాశం లేకపోలేదు. ఈ సమావేశంలో లఘు చర్చకు అనుమతిచి, సభ్యుల అభిప్రాయాలను తీసుకున్న తర్వాత జనవరిలో నిర్వహించాలని భావిస్తున్న కౌన్సిల్ సమావేశంలో బడ్జెట్ కూడా వ్యూహాత్మకంగా ఆమోద ముద్ర వేయాలని పాలక మండలి భావిస్తున్నట్లు తెలిసింది. ఇక మజ్లీస్, బీజేపీ పార్టీలు మాత్రం ఎప్పటిలాగే ప్రజా సమస్యలైన శానిటేషన్, దోమలు, కుక్కల బెడద, స్ట్రీట్ లైట్ మెయింటనెన్స్, రోడ్ల నిర్వహణ, నాలాలు, వరద నీటి కాలువల నిర్వహణ వంటి అంశాలను ప్రస్తావించేలా ప్రశ్నలు సమర్పించిన్నట్లు తెలిసింది.

# జీవో నెంబర్ 46 దగ్ధం చేసిన బిసి సంఘాలు



జీవో నెంబర్ 46 దగ్ధం చేసిన బీసీ సంఘాలు.

**హైదరాబాద్ నవంబరు 23 (ప్రభాతవార్త :**

స్థానిక సంస్థలలో బీసీల రిజర్వేషన్లను 42 శాతం నుంచి 22 శాతంకు తగ్గిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 46ను ఆదివారం విద్యానగర్ చౌరస్తాలో బీసీ సంఘాల నాయకులు కాల్చి దద్దంచేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యతో పాటు డాక్టర్ రిషి అరుణ్‌కుమార్, నాగేశ్వరరావు, భూమన్నయాదవ్, నూకాలమ్మ, రాజుగౌడ్, వీరంకి వీరస్వామి, దుద్దికురి శ్రీనివాస్‌రావు, గువ్వల సత్యం, వీరబాబు, రమేష్, అల్లా రామారావు పాల్గొన్నారు. రెండు సంవత్సరాల నుండి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఎన్నికల వాగ్దానం చేశారు. కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ ప్రకటించారు. అసెంబ్లీలో చట్టం చేశారు. మంత్రివర్గంలో చర్చించి ఆర్డినెన్స్ తీసారు. మంత్రివర్గంలో రెండుసార్లు తీర్మానం చేశారు. మంత్రులు కాంగ్రెస్ పార్టీ నాయకులు వందలసార్లు పదేపదే చట్టబద్ధంగా 42 శాతం ఇస్తామని ప్రకటించారు. తీరా ఇప్పుడు బీహార్ ఎన్నికలు పూర్తిగానే చేతులెత్తేసి బీసీలకు ద్రోహం చేస్తూ, తగ్గిస్తూ జీవో నెంబర్ 46 జారి చేసి గొంతు కోశారు. రాష్ట్రంలోని రెండు కోట్ల మంది బీసీలు తమకు అన్యాయం చేశామని కుత, కుత లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ జీవోను వెంటనే ఉపసంహరించుకోకపోతే బీసీలు తిరగబడతామని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలను పచ్చి మోసం దగా చేస్తుంది. గ్రామపంచాయతీ ఎన్నికలకు పార్టీ ప్రతిపాదిక పార్టీ ఎన్నికల గుర్తు ఉండదు. పార్టీ ప్రతిపదికన 42 శాతం అని ఎలా అంటారు - ఇది మోసం కాదా? రిజర్వేషన్ల కేసు బలమైన పునాదులు ఉన్నవి. రాజ్యాంగబద్ధంగా, చట్టబద్ధంగా న్యాయబద్ధంగా యున్నవి. జనాభా లెక్కలు యున్నవి. కేసు గెలుస్తుంది. బీహార్ ఎన్నికల వరకు ఆగి ఎన్నికల ఫలితాలు రాగానే అసలు నిజం రూపం బయటపడింది. గ్రామపంచాయతీ రిజర్వేషన్లు 22 శాతంకు తగ్గించి ఎన్నికలకు పోవాల్సిన అవసరం ప్రభుత్వానికి ఏముంది. ఒకవైపు హైకోర్టులో కేసు నడుస్తుంది. కేసు విచారణలో ఉండగా తీర్పు రాక ముందే ఎన్నికలకు వెళ్లాల్సిన అవసరం ఏముంది. మన దగ్గర ఎన్నికల ఆలస్యం ఒక సంవత్సరం మాత్రమే కానీ పక్క రాష్ట్రాలైన మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్ నాలుగు సంవత్సరాల నుంచి ఎన్నికలు జరగలేదు. పెండింగ్ లో యున్నవి. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అఖిలపక్షాన్ని ప్రధానమంత్రిని కలవడానికి ఎందుకు వెళ్ళలేదు. ఇదేనా చిత్త శుద్ధి. ఇండియా కూటమికి నాయకత్వం వహిస్తూన్న కాంగ్రెస్ పార్టీకి లోక్‌సభలో 240 ఎంపీలు ఉన్నారు. ఒకరోజు కూడా పార్లమెంటులో ఎందుకు ప్రస్తావించలేదు. బీహార్ ఓట్ చోరీ అంటూ నెల రోజులు పార్లమెంటు స్తంభింపజేసి ఇండియా కూటమి బీసీల కోసం నాలుగురోజులు పార్లమెంటు ఎందుకు సంభవించలేదు ఇదేనా మీ చితదుద్ది అని ప్రశ్నించారు.

## ఎల్ఐసీ కార్యాలయంలో
## ఏజెంట్‌పై ఉద్యోగి దాడికి యత్నం

**బేగంపేట, నవంబరు 23,ప్రభాతవార్త :**

ఎల్ఐసి కార్యాలయంలో ఏజెంట్‌పై ఓ ఉద్యోగి దాడికి యత్నించడంతో పాటు అసభ్యంగా తిట్టిన ఘటన లేక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... మంగళంపల్లి శ్రీనివాస్ ఎల్ఐసీ ఏజెంటుగా 17 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నాడు. ఈనెల 3వ తేదీన సాయంత్రం ఆయన బ్రాంచిలోని ఏజెంట్ రూములో కూర్చుని ఉండగా అదే కార్యాలయంలో పనిచేస్తున్న రవి అకారణంగా ఆయనపై పేపర్ వెయిట్‌తో దాడి చేసేందుకు యత్నించగా అక్కడే ఉన్న సిబ్బంది అడ్డుకున్నారు. అలాగే నోటికి వచ్చినట్లు బూతులు తిడుతూ చంపేస్తానని బెదిరించాడు. అంతటితో ఆగకుండా ఫోన్‌చేసి బెదిరింపులకు పాల్పడుతున్నాడు. అయితే గతంలో రవి అనే ఉద్యోగి శ్రీనివాస్‌కు చెందిన కస్టమర్లను ఇతర ఏజెంట్లతో మాట్లాడించడంతో బ్రాంచ్ మేనేజర్‌కు ఫిర్యాదు చేసారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని తనపై దాడికి పాల్పడినట్లు ఆయన లేక్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసాడు. అయితే పోలీసులు న్యాయ సలహాకు ఈ ఫిర్యాదును పంపించి వారి సూచన మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. రవి నుంచి తన కుటుంబానికి రక్షణ కల్పించాలిని బాధితుడు ఫిర్యాదులో కోరారు.



విహెచ్‌తో రోహిత్‌ముదిరాజ్ తదితరులు

## విహెచ్‌ను కలిసి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మోతా రోహిత్

**హైదరాబాద్, నవంబరు 23 ,ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన మోతా రోహిత్‌ముదిరాజ్ ఆదివారం మాజీ ఎంపి వి.హనుమంతరావును మర్యాదపూర్వకంగా కలిసారు. బాగ్‌అంబర్‌పేట్ లోని విహెచ్‌నివాసంలో కలిసి ఆశీర్వాదం తీసుకుని పార్టీ అభివృద్ధిపై చర్చించారు. ఈకార్యక్రమంలో టిపిసిసి ఉపాధ్యక్షులు అప్సర్ యూసుఫ్ జాయి మాజీ కార్పొరేటర్ పుల్లా నారాయణస్వామి, పిసిసి కార్యదర్శి శంభుల శ్రీకాంత్ గౌడ్, కృష్ణా గౌడ్, గడ్డం శ్రీధర్ గౌడ్, కోటం అనిల్, ఈ.ప్రభాకర్ సి. సుధాకర్ జహంగీర్, సతీష్ సర్ఫరాజ్ తదితరులు పాల్గొన్నారు.



సత్యసాయిబాబా ఎఐ వీడియో పాటల ఆల్బమ్ విడుదల చేసిన ఎపి సిఎం

## సత్యసాయి బాబా ఎఐ వీడియో పాటల ఆల్బమ్ విడుదల

**హైదరాబాద్, నవంబరు 23 ప్రభాతవార్త :** భగవాన్ శ్రీసత్య సాయిబాబా శత జయంతి ఉత్సవాలలో భాగంగా ఆదివారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సౌభాగ్య చిత్ర నిర్మించిన శ్రీసత్య సాయిబాబా మై లైఫ్ ఈజ్ మై మెసేజ్ ఆల్బమ్ కోసం హైదరాబాద్‌కు చెందిన ఈస్ట్ ఎఫ్ఎక్స్ మీడియా కమ్యూనికేషన్ విభాగం మ్యూజిక్ ఎఫ్ఎక్స్ రూపొందించిన ఎఐ వీడియో పాటల ఆల్బమ్‌ను పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ, ఆధ్యాత్మిక గురువు శ్రీ సత్యసాయి బాబాను డిజిటల్‌గా తిరిగి జీవంపోయడానికి అధునాతన కృత్రిమ మేధస్సును ఉపయోగించి భారతదేశంలోని అతిపెద్ద సంగీత దిగ్గజాలు ప్రదర్శించిన భక్తి పాటలతో నవీకరించిన ఎఐసృష్టించిన వీడియో ఇమేజరీ అద్భుతంగా ఉందని కొనియాడారు. సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వాన్ని ఎలా కాపాడుకోగలదో చెప్పడానికి ఈ ప్రాజెక్టు ఒక అద్భుతమైన ఉదాహరణ అని ఆయన ప్రశంసించారు. ఇది సాంకేతికత, సంప్రదాయాల కలయికను ఉదహరిస్తుందన్నారు. ఈ ప్రాజెక్టును ప్రపంచంలోనే మొట్టమొదటి విజయంగా ఆయన అభివర్ణించారు. సత్య సాయి బాబాను ఎప్పుడూ చూడని యువతరానికి ఆయన ఉనికిని తెలియజేయడానికి, ఆయన ఆధ్యాత్మికను అనుభవించడానికి వీలు కల్పించిందన్నారు. ఈస్ట్ ఎఫ్ మీడియా కమ్యూనికేషన్ విభాగం మ్యూజిక్ ఎఫ్ఎక్స్ ప్రతినిధి నివేదిత సాతేకల్ మాట్లాడుతూ 2011లో మరణించిన ఆధ్యాత్మిక గురువు భగవాన్ శ్రీసత్యసాయి బాబా దృశ్య ఉనికిని పునఃసృష్టించడానికి అత్యాధునిక ఎఐ సాంకేతికతను ఉపయోగించి రూపొందించిన ఈ మ్యూజిక్ వీడియో తన శత జయంతి వేడుకల సందర్భంగా ప్రారంభించిన కొన్ని గంటల్లోనే ప్రపంచవ్యాప్తంగా వ్యాపించిందన్నారు. టోక్యో నుండి టొరంటో వరకు, ముంబై నుండి మెక్సికో సిటీ వరకు, ఎవరైనా ఇప్పుడు ఈ పాటలను వారు ఇష్టపడే ప్లాట్ యాక్సెస్ చేయవచ్చు అని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సౌభాగ్య చిత్ర నిర్మాత కరటం రమేష్ సహ నిర్మాత వంశీ కరటం, క్రియేటర్ ప్రొడ్యూసర్ స్వప్నేష్ చింతల, మ్యూజిక్ ఎఫెక్ట్ బృందం సభ్యులు వైష్ణవి హైదనూరు, మహ్మద్ అన్వర్, నరేష్ శామర్థి తదితరులు పాల్గొన్నారు.



చిన్నారితో సౌత్ బెస్ట్ జోన్ అదనపు డిసిపి కృష్ణ గౌడ్

## బాలిక కిడ్నాప్ కేసు సుఖాంతం

**24 గంటల్లో చేదించిన పోలీసులు**

**తల్లిదండ్రుల చెంతకు చిన్నారి... ఇద్దరు నిందితుల రిమాండ్**

ఒక ఆటో, రెండు సెల్ ఫోన్ లు, చిన్నారి దుస్తువులు స్వాధీనం.

మెహిదీపట్నం, నవంబర్ 23, ప్రభాతవార్త : నాలుగేళ్ల చిన్నారి బాలిక కిడ్నాప్ కేసును గోల్కొండ పోలీసులు 24 గంటల్లో చేదించి...చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించారు. కిడ్నాప్ కేసు వివరాలను గోల్కొండ పోలీస్ స్టేషన్ లో ఆదివారం సౌత్ వెస్ట్ జోన్ అదనపు డిసిపి కృష్ణ గౌడ్ వెల్లడించారు. కౌసరియా మజీద్ సాలె నగర్ కంచ గోల్కొండ ప్రాంతానికి చెందిన షేక్ ముఝమిల్ ముజాత్ ఫాతిమా బేగంల రెండవ కుమార్తె సఫియా బేగం(4) శుక్రవారం మధ్యాహ్న సమయంలో అదే ప్రాంతంలో ఉన్నటువంటి అమ్మమ్మ అయినటువంటి నసీమా బేగం ఇంటికి వెళ్ళింది. తిరిగి సాయంత్రం ఇంటికి రాకపోవడంతో తల్లి అయిన నుజాత్ ఫాతిమా బేగం తన అమ్మకు ఫోన్ చేసింది. పాప ఇంటికి తిరిగి వచ్చిందని చెప్పడంతో కంగారు పడిన తల్లి అక్కడ ఇక్కడ వెతికి కుమార్తె కనిపించకపోవడంతో గోల్కొండ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకున్న గోల్కొండ పోలీసులు 9 ప్రత్యేక బృందాలతో సిసి ఫుటేజ్‌లను పరిశీలించి చిన్నారి కిడ్నాప్ అయినట్లు గుర్తించారు. హకీంపేట్ టోలిచౌకి ప్రాంతానికి చెందిన మహమ్మద్ ఫయాజ్ (25)కు ఆసిఫ్ నగర్ ప్రాంతానికి చెందిన సమీన్ బేగం (23) అలియాస్ సల్మా బేగం మాజీ భార్య. ఈమె కుటుంబ కలహాలతో భర్త నుండి విడిపోయి ఆసిఫ్ నగర్‌లో ఉంటూ మాసబ్ ట్యాంక్ లోని కింగ్ స్టాన్ ఆస్పత్రిలో హౌస్ కీపింగ్ వర్కర్‌గా పనిచేస్తుంది. మళ్లీ మొహమ్మద్ ఫయాజ్ తో కలిసి ఉండాలని పథకం ఫన్ని తాను విడాకులకు ముందు ప్రెగ్నెన్సీగా ఉన్నానని, ఇప్పుడు నాలుగేళ్ల చిన్నారి ఉందని భర్తకు చెప్పి నమ్మించింది. దీంతో చిన్నారిని తీసుకురావడానికి సాలె నగర్ కంచ గోల్కొండ ప్రాంతంలో ఒంటరిగా ఉన్నటువంటి సఫియా బేగంను ఆటో (టీఎస్15యుఎఫ్3372)లో తీసుకొచ్చి ఆసిఫ్ నగర్ లో దాచి పెట్టారు. పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా చిన్నారిని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. ఇద్దరు నిందితుల నుండి ఒక ఆటో, రెండు సెల్ ఫోన్ లు, చిన్నారి దుస్తులను స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో గోల్కొండ ఏసిపి సయ్యద్ ఫయాజ్, గోల్కొండ ఇన్ స్పెక్టర్ పి సైదులు, ఎస్ ఐ రాము నాయుడు, డి ఎస్ ఐ ఆంజనేయులు ఉన్నారు.

## గాయపడిన మరో హిజ్రా మృతి

**- రెండుకు చేరిన మృతుల సంఖ్య**

**జూబ్లీహిల్స్, నవంబరు 23, ప్రభాతవార్త :** బోరబండలో ఈ నెల 18న జరిగిన సంఘటనలో మరో హిజ్రా ఆదివారం తెల్లవారుజామున మృతిచెందింది. ఈ నెల 18న స్వప్న గ్యాంగ్‌కు చెందిన హిజ్రాలు బోరబండ కూడలిలో పెద్దఎత్తున ఒంటిపై పెట్రోల్ పోసుకొని, చేతిలో లైటర్లు పట్టుకొని ఆందోళన నిర్వహించిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలోనే అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో ఏడుగురు హిజ్రాలకు మంటలంటుకున్నాయి. వారిలో ముగ్గురికి తీవ్ర గాయలవ్వగా మిగిలిన నలుగురికి స్వల్ప గాయలయ్యాయ. కాగా రెండు రోజుల క్రితం హఫ్సాన మృతి చెందిన విషయం విదితమే. కాగా మిగిలిన బాధితులు గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా ఆదివారం తెల్లవారుజామున ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హీనా(22) ఆరోగ్య పరిస్థితి విషమించి మృతిచెందింది. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. సంఘటన జరిగిన రోజున నవనీతకు 54 శాతం, సాయిశ్రీ మోక్షిత 42 శాతం, టీనా సునార్ 35 శాతం, ప్రాచికి 18 శాతం కాలిన గాయలయ్యాయి.

# ఘనంగా రాష్ట్రపతి నిలయంలో భారతీయ కళామహోత్సవం





రాష్ట్రపతి నిలయం బొల్లారంలో జరిగే భారతీయ కళామహోత్సవం ఆదివారం సందర్శకులతో నిండిన చిత్రం



సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాన్ని నిర్వహిస్తున్న భక్తులు

## ఘనంగా భగవాన్ సత్యసాయిబాబా శత జయంతి

**సరూర్‌నగర్, నవంబరు 23 ప్రభాతవార్త:** నగర శివార్లలోని మీర్‌పేట్‌లో ఆదివారం భగవాన్ శ్రీసత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మీర్‌పేట్ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సందర్భంగా సాయిబాబా భక్తులు వంద రకాల ప్రసాదాల నైవేద్యం సమర్పించారు. అదేవిధంగా 100 నిమిషాల పాటు వంద భజన పాటలను ఆలపించారు. అంతకుముందు ఓంకారం, సుప్రభాతం, రుద్రం, సహస్రనామార్చన, నారాయణ సేవ తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మీర్‌పేట్ పురవీధుల్లో స్వామి వారి పల్లకీ సేవను భక్తి శ్రద్ధలతో జరిపారు. కార్యక్రమాల్లో సభ్యులు శివానందం, కృష్ణమూర్తి, ఎర్రయ్య, అంబా శంకర్, రవి, గంగా రామకృష్ణ, నారాయణరావు, వెంకట కృష్ణారావు, పెద్ద సంఖ్యలో సాయిభక్తులు పాల్గొన్నారు.

## గుర్రం లక్ష్మారెడ్డి మృతి కాంగ్రెస్‌కు తీరని లోటు: పారిజాత



గుర్రం లక్ష్మారెడ్డికి నివాళులర్పిస్తున్న పారిజాత నర్సింహారెడ్డి

**సరూర్‌నగర్, నవంబరు 23 ప్రభాతవార్త:** కాంగ్రెస్‌నాయకుడు, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ గుర్రం లక్ష్మారెడ్డి మృతి పార్టీకి తీరని లోటని టిపిసిసి ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం గుర్రంగూడలో జరిగిన లక్ష్మారెడ్డి పెద్ద కర్మ కార్యక్రమానికి ఆమె హాజరై నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు జక్కిడి విష్ణువర్ధన్‌రెడ్డి, గొరిగె అయిలమ్మ, బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, జెల్ల రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

## గ్యార్వీ షరీఫ్ ఉత్సవాలు.. పాల్గొన్న కార్పొరేటర్



ప్రార్థనల్లో పాల్గొన్న కార్పొరేటర్ విజయారెడ్డి

**జూబ్లీహిల్స్, నవంబరు 23, ప్రభాతవార్త :** ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ఈద్గా గ్రౌండ్ ఎంఎస్ మక్తాలోగల దర్గాలో గ్యార్వీ షరీఫ్ ఉత్సవాల్లో టీపీసీసీ కార్యదర్శి, ఖైరతాబాద్ డివిజన్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇక్కడ నిర్వహించిన ప్రార్థనలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో తహబాయ్, మహమ్మద్ రఫీ, నాసర్, అంజద్, హమీద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నికృష్ణన్ పార్కులో ఆటవస్తువుల ఏర్పాటు



పార్కులో ఆడుకుంటున్న చిన్నారులు

**నిజాంపేట్, నవంబర్ 23, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానందగౌడ్ సహకారంతో నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ 22వ డివిజన్ వాసవి లేఅవుట్‌లోని ఉన్నికృష్ణన్ పార్కులో ఆదివారం చిల్డ్రన్స్ ఎక్విప్‌మెంట్, సెంట్రల్ లైటింగ్‌ను మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేయడం జరిగింది. మున్సిపల్ అధికారులు సమకూర్చిన జెసిబి సహాయంతో ఉన్నికృష్ణన్ పార్కు అసోసియేషన్ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో పార్కును మొత్తం లెవెలింగ్ చేసి అందులో ఉన్న రాళ్లను బయటికి పంపించడం జరిగింది. కమిటీ సభ్యులు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు జెసిపి దగ్గర ఉండి పార్కులో ఉన్న రాళ్లను ట్రాక్టర్ సాయంతో బయటికి పంపించి మట్టిని చదును చేయించడం జరిగింది. కార్యక్రమంలో సాంబశివారెడ్డి తదితరులు పర్యవేక్షి ంచారు.

## ఎమ్మెల్యే లక్ష్మారెడ్డితో రామంతాపూర్ బిఆర్ఎస్ నేతల బేటి

**ఉప్పల్, నవంబరు 23 ప్రభాతవార్త :** ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో ఆదివారం రామంతాపూర్ డివిజన్‌కు చంఎదిన పలువురు బిఆర్ఎస్ పార్టీ నేతలు కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం అంకితభావంతో పని చేసే కార్యకర్తలకు తప్పకుండా తగిన ప్రాధాన్యత కల్పిస్తానని తెలిపారు. డివిజన్ అధ్యక్ష పదవిలో అన్ని కోణాలలో ఆలోచించి తగు నిర్ణయం తీసుకుంటానని హామీ ఇచ్చారు. పార్టీ కోసం పనిచేసే వారికి పదవులు ఇవ్వాలని పలువురు విన్నవించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేతలు పాలకూరి శ్రీకాంత్ గౌడ్, సంబెటి నరేష్, సూరం శంకర్, చాంద్ పాషా, ఆపిల్ శ్రీను, మారుతీ జాదవ్, తుఫాన్, రామకృష్ణ, శరత్,పెయింటర్ శ్రీను, సుధాకర్, శివ, ముకేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని సత్కరిస్తున్న బిఆర్ఎస్ పార్టీ నేతలు

# బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలి

### తెలంగాణ బిసి సంఘాల జెఎసి చైర్మన్ ఓరుగంటి వెంటకేష్‌గౌడ్



మాట్లాడుతున్న ఒరుగంటి వెంకటేశంగౌడ్

**సైఫాబాద్, నవంబరు 23 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జివొనెంబరు 46ను ఉపసంహరించుకుని బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తూ స్థానిక సంస్థలకు ఎన్నికలు జరపాలని తెలంగాణ బిసి సంఘాల జెఎసి చైర్మన్ ఒరుగంటి వెంటకేష్‌గౌడ్ డిమాండ్‌చేశారు. లేనిపక్షంలో సోమవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, నిరసన ప్రదర్శనలు, దీక్షలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసి రిజర్వేషన్లపై హైకోర్టులో సోమవారం వాదనలు ఉన్నప్పటికి ప్రభుత్వం హడావుడిగా జివొ నెంబరు 46ని తీసుకురావాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తామని ఎన్నికల ముందు ఎఐసిసి నేత రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ నేతులు గొప్పలు చెప్పారని, అధికారంలోకి వచ్చి రెండేళ్ళు గడిచినా 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించకుండా ఎస్సీ, ఎస్టీ, బిసిలకు కలిపి 50 శాతం రిజర్వేషన్‌ల లోపుతో ఎన్నికలు నిర్వహించడం బిసిలను నిలువునా మోసం చేయడమేనని ఆయన ధ్వజమెత్తారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించడంలో కాంగ్రెస్, బిజెపి పార్టీలు కావాలని మోసం చేస్తున్నాయని, వచ్చే స్థానిక సంస్థల, జిహెచ్ఎంసి ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని ఆయన బిసిలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బిసి నేతలు కోలా జనార్ధన్, సారంగ అనితాగౌడ్, సోమేశ్వర్, సంగమేశ్వర్, రాములు తదితరులు పాల్గొన్నారు.



చెవిలో పువుపెట్టుకుని జివొ నెంబరు 46 కాపీలను చించేస్తున్న రామకృష్ణ

### జీవో నెంబరు 46ను రద్దుచేయాలని

## బిసిల వినూత్న నిరసన

**హైదరాబాద్, నవంబరు 23 ప్రభాతవార్త :** బిసిల రిజర్వేషన్‌లపై రాష్ట్ర ప్రభుత్వం నమ్మించి మోసం చేసిందని ఆరోపిస్తూ అనేక మంది బిసిలు ఆదివారం నాడిక్కడ చెవిలో పువ్వులు పెట్టుకుని, నల్ల కండువాలు ధరించి, జివొ నెంబరు 46 కాపీలను చించివేస్తూ వినూత్న ప్రదర్శన నిర్వహించారు. జివొ నెంబరు 46ను ఉపసంహరించుకోవాలని, 42 శాతం రిజర్వేషన్‌లతో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని ఈ కార్యక్రమంలో పాల్గొన్న బిసిలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ మాట్లాడుతూ బిసిలకు రెండు సంవత్సరాలుగా 42 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తామని ప్రభుత్వం పదే పదే ప్రకటించి, జివొ నెంబరు 46ను విడుదల చేసి తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. ప్రభుత్వం కులగణనను బయటపెట్టడంలేదని, అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లడం లేదని, ఇండియా కూటమి ఎంపిలు పార్లమెంట్‌లో చర్చించడం లేదని ఆయన నిశితంగా విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో బిసి రిజర్వేషన్‌లను 9వ షెడ్యూల్‌లో పెట్టించాలని ఆయన డిమాండ్ చేశారు. 42 శాతం రిజర్వేషన్‌లు వచ్చేంతవరకు స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించరాదని, తక్షణమే జివొ నెంబరు 46ను ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు.

## సాగర తీరం బాల గేయాల పుస్తకం ఆవిష్కరణ



సాగర తీరం అను బాలాగేయాల పుస్తకాని ఆవిష్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి నవంబరు 23(ప్రభాతవార్త):** ప్రముఖ రచయిత గద్వాల సోమన్న రచించిన సాగర తీరం అను బాలాగేయాల పుస్తకావిష్కరణ సభ ఆదివారం సంగీత సాహిత్య సాంస్కృతిక సమన్వయ సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వి.డి.రాజగోపాల్ నిర్వహణలో జరిగింది. ప్రతి నెల జరుపుకునే కార్యక్రమంలో భాగంగా అంతర్జాల వేదికపై భగవాన్ పుట్టపర్తి సాయిబాబా, పండిట్ జవహర్‌లాల్ నెహ్రు, దాశరథి,అబ్దుల్ కలాం, అందెశ్రీలను స్మరించుకుంటూ కవిసమ్మేళనం జరిగింది. అనంతరం గద్వాల సోమన్న రచించిన సాగరతీరం అను బాలాగేయాల పుస్తకం ఆవిష్కరణ జరిగింది. ప్రముఖ గాయకుడూ శరత్ చంద్ర, రవీంద్రబాబు గానామృతంతో అలరించారు. డా. వోలేటి పార్వతీశం ముఖ్యఅతిథిగా, డా.నాళేశ్వరం శంకరం, డా.దుర్గాప్రసాద్ విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎం సిద్ధారెడ్డి, ఎ.ఎల్.కృష్ణారెడ్డి, డాక్టర్ ఎన్ వెంకటరమణ, పి. బయ్యపురెడ్డి, ఎ.వి.సుబ్రహ్మణ్యం, ప్రతికంతం విజయ రామ రాజు, .డాక్టర్ ఉషా రాణి కోగంటి,శ్రీమతి ఎన్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సిద్ధిబుద్ధి గణపతి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

**చిక్కడపల్లి నవంబరు 23 (ప్రభాతవార్త):** నగరంలో ప్రసిద్ధిగాంచిన వివేక్‌నగర్ శ్రీఆంజనేయస్వామి దేవాలయంలో సిద్ధి బుద్ధి సహిత గణపతి, దత్తసాయి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఆదివారం కనుల పండువగా జరిగింది. ఆలయం చైర్మన్ జానకి సుధాకర్ ఈవో మాచర్ల దేవనాథం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆంజనేయస్వామికి వాహనమైన ఒంటె విగ్రహం, ప్రాణ ప్రతిష్ఠ చేశారు. ఇదే కార్యక్రమంలో 160 కేజీల వెండి తో సంజీవని కొండ, స్వామి వారికి వెండి కవచం సింహాసనం, రెండు మకర తోరణాలతో సుందరంగా తీర్చిదిద్దారు. ఇవే కాకుండా సీతా రామ లక్ష్మణ సహిత ఆంజనేయస్వామికి పంచలోహ విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఎంతో అద్భుతంగా సాగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్,దేవాదాయ ధర్మాదాయశాఖ అదనపు కమీషనర్ ఎం శ్రీనివాసరావు, గాంధీనగర్ కార్పొరేటర్ ఏ పావని వినయ్ కుమార్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, చిక్కడపల్లి ఏసీబీ ఎల్ రమేష్ కుమార్, ఆలయం మాజీ చైర్మన్ గంగం రవి, టిఆర్ఎస్ నేత ఎంఎన్ శ్రీనివాసరావు, బిజెపి సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఏ వినయ్ కుమార్, టిఆర్ఎస్ యువ నేత ముఠా జయసింహ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు బుగ్గ లక్ష్మీపతి శర్మ, కందాల వెంకటాద్రి, ధర్మకర్తలు వెంకట్రావు, రామకృష్ణ, పద్మావతి, మురికి గణేష్, శ్యాం ముదిరాజ్, శిశు కుమార్, నిర్మల, బిజెపి, బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న వినయ్ కుమార్

## బిజెపి గాంధీనగర్ డివిజన్ కార్యవర్గ సమావేశం

**చిక్కడపల్లి నవంబరు 23 (ప్రభాతవార్త) :** రాబోయే రోజుల్లో గాంధీనగర్ డివిజన్ బిజెపి ఆధ్వర్యంలో నిర్వహించబోయే ముఖ్య కార్యక్రమాల కార్యాచరణ సమావేశం డివిజన్ అధ్యక్షుడు వి.నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం, అశోక్‌నగర్ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ హాల్‌లో నిర్వ హించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి సికింద్రాబాద్ పార్ల మెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, హంకాళి జిల్లా అధికార ప్రతినిధి, దిశా కమిటీ సభ్యురాలు శారదా మల్లేష్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో డివిజన్ లో చేపట్టవల్సిన కార్యక్రమాలు వివరించారు. వందేమాతరం 150 సంవత్సరాలు, సర్దార్ వల్లభాయ్ పటేల్ గారి 150వ జయంతి, ఆత్మ నిర్భర్ భారత్, మరియు బూత్ కమిటలు వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వినయ్ కుమార్ మాట్లాడుతూ బిజెపి రాష్ట్ర పార్టీ సూచనల మేరకు జరగబోయే కార్యక్రమాలను నాయకులు, కార్యకర్తలతో కలిసి నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని, పార్టీ కార్యక్రమాలతో పాటు డివిజన్ లోని ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగాడివిజన్ బిజెపి నాయకులకు కార్యకర్తలకు దిశానిర్దేశం చేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా రాబోయే జి హెచ్ ఎం సి ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ స్థానాలలో విజయం సాధించి ఖచ్చితంగా మేయర్ స్థానాన్ని బిజెపి కైవసం చేసుకుంటుందని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ నేతలు రత్న సాయి చంద్, శ్రీకాంత్, విస్టి రాజు, దామోదర్, ఎం.ఉమేష్, సురేష్ రాజు, ఆనంద్‌రావు, విజయలక్ష్మి, సంయుక్తరాణి, డివిజన్‌లోని పదాధికారులు,ముఖ్య నాయకులు,మోర్చల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

## బిజెపి అడిక్‌మెట్ డివిజన్ కార్యవర్గ...

**చిక్కడపల్లి నవంబరు 23 (ప్రభాతవార్త):** బీజేపీ అడిక్‌మెట్ డివిజన్ కార్యవర్గ సమావేశం డివిజన్ అధ్యక్షుడు పాశం సాయికృష్ణ యాదవ్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. పార్టీయే నగర కమిటీ ఆదేశాల మేరకు జరిగిన సమా వేశంలో రాబోయేరోజుల్లో పార్టీ ఆదేశానుసారం వివిధ అభియాన్లలో చురుకుగా పాల్గొనాలని విజయవంతం చేయాలని నిర్ణయించడం జరిగింది.సర్దార్ పటేల్ అభియాన్, మన్ కి బాత్ ప్రోగ్రాం యోజన, ఆత్మ నిర్భర్ భారత్ ఉద్యమ ప్రోగ్రామ్ యోజన, సంస్థ గత విషయాలు ఇవాళ చర్చించి నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఆత్మ నిర్భర్ భారత్ యోజనలో భాగంగా స్వదేశీ ఆత్మనిర్భర్ ప్రత్యక్ష చేయడం జరిగింది. ముఖ్య అతిథిగా పార్టీ రాత్రి కౌన్సిల్ సభ్యుడు రొయ్యూరు శేషసాయి ప్రసంగించారు. రాబోయేరోజుల్లో ప్రతి ప్రోగ్రాం జయప్రదం చేయాలని డివిజన్ అధ్యక్షుడు సాయి కృష్ణయాదవ్ పిలుపునిచ్చారు.

## వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ నూతన అధ్యక్షుడిగా మనోహర్‌రెడ్డి

**చిక్కడపల్లి నవంబర్ 23 (ప్రభాతవార్త):** సుందరయ్య పార్క్ అభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందిస్తానని ముషీరాబాద్ శాసనసభ్యుడు ముఠా గోపాల్ అన్నారు. ఆదివారం వాకర్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఎస్. మనోహర్ రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం ఎమ్మెల్యే ముఠా గోపాల్ను మర్యదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ప్రస్తుత అధ్యక్షుడు పివి నిరంజన్ రెడ్డి, వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వ అధ్యక్షుడు నాగభూషణం, క్లబ్ పూర్వ అధ్యక్షులు రమేష్‌రెడ్డి, వివేక్, శైలజమోహన్, సంతోష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో నగర క్రీడాకారుల ప్రతిభ

**చిక్కడపల్లి నవంబర్ 23(ప్రభాతవార్త):** రాష్ట్ర బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో నగరానికి చెందిన క్రీడాకారులు సత్తాచాటారు. ఆదివారం యోనెక్స్, సన్ రైస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అండర్ 11 బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ 2025 టోర్నమెంట్‌లో మ్యాచ్‌పాయింట్ అకాడమీ క్రీడాకారులు సత్తా చాటారు. క్రీడాకారులు లట్టాల శాన్వి, ఎవిలిన్ ప్రియాంక్ జోడి డబుల్స్ విభాగంలో అద్భుతమైన ఆటతో ద్వితీయ స్థానం గెలుచుకున్నారు. అద్భుతమైన ఆట తీరుతో ఫైనల్ కి చేరుకున్న ఈ జోడి నువ్వా నేనా అంటూ సాగిన చివరి మ్యాచ్ లో స్వల్ప తేడాతో ఓడిపోయి సిల్వర్ మెడల్ గెలుచుకున్నారు. ఈ సందర్భంగా మ్యాచ్ పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమీ చైర్మన్, హెడ్ కోచ్ వేణు ముప్పాల మాట్లాడుతూ.. అద్భుతమైన ఆటను ప్రదర్శించారని భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షి ంచారు.కార్యక్రమంలో కోచ్ రాధాకృష్ణ, మ్యాచ్ పాయింట్ కోచింగ్ సిబ్బంది వినోద్ ,సిద్ధూ,శివ తదితరులు పాల్గొన్నారు.




క్రీడాకారులను అభినందిస్తున్న హెడ్ కోచ్ వేణు తదితరులు

## ఉత్పాదకతకు కొత్త నిర్వచనం ఇస్తున్న జెన్ జీ



సదస్సులో పాల్గొన్న చరణ్ లక్కరాజు ఇతర సభ్యులు

**జూబ్లీహిల్స్, నవంబరు 23, ప్రభాతవార్త**

హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జెన్ జీ, పని ప్రదేశంలో ఉత్పాదకత అనే అంశంపై ఒక ప్రత్యేక సదస్సు నిర్వహించారు. స్టూడెంట్ ట్రైబ్ వ్యవస్థాపకులు, సీఈఓ చరణ్ లక్కరాజు ముఖ్య అతిథిగా పాల్గొని ఆధునిక ఉద్యోగ వాతావరణంలో జెన్ జీ(యువతరం) తీసుకువస్తున్న మార్పులపై మాట్లాడారు. సంస్థ యాజమాన్యాలు ఇకపై పర్యవేక్షణకు బదులు కోచ్‌లుగా మారి, ఉద్యోగులకు స్వేచ్ఛ, వెసులుబాటు, విశ్వాసం కల్పించే వాతావరణాన్ని సృష్టిస్తే వారి నిజమైన పనితీరు వెలుగులోకొస్తుందన్నారు. సమాజంలో ఉన్న అసహనం, అలజడి, శ్రద్ధలేమిలాంటి అభిప్రాయాలు వాస్తవం కాదని ఆయన స్పష్టం చేశారు. జెన్ జీ తరం లోతైన అవగాహన, ఆధ్యాత్మికత, ఆరోగ్య అవగాహన, ప్రభావం ఆధారిత దృక్కోణం కలిగినవారన్నారు. వారు తక్కువ ఉత్పాదకత కలవారు కారని, వేరే విధమైన ఉత్పాదకత చూపిస్తూ, శరవేగంగా ఎదగాలని, అందరితో స్వేచ్ఛగా మాట్లాడాలని భావిస్తారని, అలాగే వ్యక్తిత్వానికి గౌరవం కోరుకుంటూ నిజాయతీతో కూడిన పని సంస్కృతి కావాలనుకుంటారని ఇవే జెన్ జీ ప్రధాన ప్రాధాన్యాలని లక్కరాజు వివరించారు. ఈ మార్పులను అర్థం చేసుకొని సంస్థలు తమ విధానాలను మార్చుకుంటే, జెన్ ఏఐ యుగంలో మానవ వనరుల పూర్తి సామర్థ్యాన్ని సంస్థలు వెలికితీయగలవని అన్నారు. ఈ సందర్భంగా హెచ్ఎంఏ అధ్యక్షుడు అల్వాల దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ యువతకు సాధికారత కల్పించేందుకు హెచ్ఎంఏ కట్టుబడి ఉందని చెప్పారు. దీనికి ఆంత్రప్రెన్యూరియల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహిస్తామని, జెన్‌జీ తరం ఆశయాలకు అనుగుణంగా ఇతర చర్యలను రూపొందిస్తామన్నారు. కార్య క్రమంలో హెచ్ఎంఏ కార్యదర్శి వాసుదేవన్ జి పాల్గొన్నారు.



సమావేశంలో అభివాదం చేస్తున్న కార్మిక సంఘాల నేతలు

## 4 కోడ్‌లకు వ్యతిరేకంగా 26న ధర్నా

**సైఫాబాద్, నవంబరు 23 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 4 కోడ్‌లకు వ్యతిరేకంగా ఈ నెల 26న ఇందిరాపార్కు వద్ద ధర్నా కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహిస్తున్నామని పలు కార్మిక సంఘాల నేతలు ప్రకటించారు. ఆదివారం సత్యనారాయణరెడ్డి భవన్‌లో కార్మిక సంఘాల నాయకులు ఎం.డి.యూసఫ్ జనకప్రసాద్, ఆర్‌డి చంద్రశేఖర్, విజయ్ కుమార్, పాలడుగు భాస్కర్, కె.సూర్యం, కె.శ్రీనివాస్, రాంబాబు, క్రిష్ణ, భరత్ మాట్లాడుతూ కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం దారుణంగా 4 కోడ్‌లు చేసి కార్మికులకు అన్యాయం చేస్తున్నదని ఆరోపించారు. తక్షణమే 4 కోడ్‌లను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. 26వ తేదీన జరిగే ధర్నాలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

## 25న పెన్షనర్ల సదస్సు

**సైఫాబాద్, నవంబరు 23 ప్రభాతవార్త:** అఖిల భారత పెన్షనర్ల సంఘాల పిలుపు మేరకు ఈ నెల 25వ తేదీన బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో రాష్ట్రస్థాయి సదస్సును నిర్వహిస్తున్నామని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ తెలిపింది. ఎస్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ సబ్ కమిటీ కన్వీనర్ ఎం.జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ సదస్సులో ఇపిఎఫ్, సిబిటి సభ్యుడు ఆర్.కరుమలయన్, ఎఐఎస్‌జిఇఎఫ్ జనరల్ సెక్రటరీ శ్రీకుమార్, ఎంవిఎస్ శర్మ తదితరులు పాల్గొంటారని చెప్పారు. అప్పటికి సమస్యలు పరిష్కారం కాకపోతే డిసెంబరు 9, 10 తేదీలలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళనా కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. కొత్త పెన్షన్ విధానాన్ని రద్దుచేసి, పాత పద్ధతిలో పెన్షన్ విధానాని్న పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టి.బాలగంగాధర్‌రావు, స్వరాజ్‌కుమార్, శివలింగం తదితరులు పాల్గొన్నారు.

## జనవరి 3న సరూర్‌నగర్‌లో భారీ బహిరంగ సభ

### రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు గాలి వినోద్‌కుమార్

**సైఫాబాద్, నవంబరు 23 ప్రభాతవార్త :** బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ జనవరి 3వ తేదీన సరూర్‌నగర్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ తెలిపారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 20 లక్షల అసైన్డ్ భూములకు యాజమాన్యం హక్కులను ప్రభుత్వం కల్పించి, నీటి వసతి కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను విస్మరించిందని ఆరోపించారు. అసైన్డ్ భూములకు తక్షణమే యాజమాన్యం హక్కును కల్పించాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ ధరణి పేరిట పేదల భూములను గుంజుకున్నదని, కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ బిసిల ద్రోహుల పార్టీలని ఆయన ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు శ్రీనివాస్ ఆయన సమక్షంలో ఆర్‌పిఐలో చేరారు.

## ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

### - నార్సింగి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ వెంకటేష్‌యాదవ్

**నార్సింగి, నవంబరు 23 ప్రభాతవార్త :** ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని నార్సింగి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జి.వెంకటేష్‌యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం నార్సింగిలో జస్మిన్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి యాజమాన్యం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వెంకటేష్‌యాదవ్ వెళ్లి ప్రజలతో పాటు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేగంగా నగరీకరణ చెందుతున్న గ్రామాలలో ప్రజలు యాంత్రిక జీవనానికి అలవాటుపడి ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేస్తున్నారని అన్నారు. నడక, ఆసనాలు, యోగ, ప్రాణాయామం, సూర్య నమస్కారాలు వంటివి దినచర్యలో భాగం చేసుకోవాలన్నారు. పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు వైద్య బృందం నార్సింగికి రావడం సంతోషంగా ఉందని, ప్రజలకు పరీక్షలు, వైద్యం, మందులు అన్ని పూర్తి ఉచితంగా ఇవ్వడం అభినందనీయమని వెంకటేష్‌యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్య నిపుణులు, ప్రజలు పాల్గొన్నారు.

## బాచుపల్లి తెలుగు వర్సిటీ కళామందిరానికి శంకుస్థాపన

**నిజాంపేట్, నవంబరు 23, ప్రభాతవార్త :** తెలుగు భాష సాహిత్యాల విస్తృతికి విశేషంగా కృషి చేస్తూ, పరిశోధనల ద్వారా విద్యార్థులకు తెలుగు భాష పట్ల మక్కువను పెంచుతూ వారిలో సృజనాత్మకతను పెంచనున్న తెలుగు విశ్వవిద్యాలయం బాచుపల్లిలోని నూతన ప్రాంగణంలో సకల సదుపాయాలతోకూడిన కళామందిర నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. కళామందిరం నిర్మాణానికి అయ్యే ఐదు కోట్ల ఖర్చులో అధిక మొత్తాన్ని విరాళంగా అందజేసిన శాంతా బయోటెక్నిక్ వ్యవస్థాపకులు పద్మభూషణ్ కెఐ వరప్రసాద్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆడిటోరియం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 500 మంది అతిథులు కూర్చునే విధంగా నిర్మిస్తున్న ఈ ఆడిటోరియం వచ్చే ఏడాదిలోగా పూర్తికానున్నదని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ విద్య సంక్షేమ మౌలిక సదుపాయాల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఐ గణపతి రెడ్డి, విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు నిత్యానందరావు, రిజిస్ట్రార్ కోట్ల హనుమంతరావు, ఇంజనీర్ రామకృష్ణం రాజు, ఆర్థిక అధికారి సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

### పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో

## ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠా మహోత్సవం

**నిజాంపేట్, నవంబర్ 23, ప్రభాతవార్త :** బ్రహ్మశ్రీ కె.సుబ్రహ్మణ్య మూరారిశర్మ ఆధ్వర్యంలో శ్రీలలితా త్రిపురసుందరీ సమేత మహా మృత్యుంజయేశ్వర(మరకత లింగం) సహిత నందీశ్వర, సుబ్రహ్మణ్యస్వామి, ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠా మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కొలన్ నీలా గోపాల్‌రెడ్డి, ఆలయ ప్రెసిడెంట్ సభ్యులు చావలి సుబ్బారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజాంపేట్, 12వ డివిజన్, బాలాజీహిల్స్‌కాలనీ, ఇందిరమ్మ కాలనీ ఫేస్ 2లోని పంచముఖ ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో ఈ నెల 24వ తేదీ నుండి 26వ తేదీ వరకు త్రయాహ్నిక దీక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా నేడు ఉదయం 8 గంటల నుండి గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, ఋత్విక్ వరుణం, గ్రామ ప్రదక్షణం, పంచగవ్య ప్రాశనం, దీక్షాధారణం, అఖండ దీపారాధన, వాస్తుపర్యగ్నికరణం, ఆకురారోపణం, యాగశాల ప్రవేశం, హారతి మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12:30గంటలకు అన్న సమారాధన నిర్వహించనున్నారు. సాయంత్రం 04:30 గంటల నుండి అగ్ని మథనం, అగ్నిప్రతిష్ఠ, గణపతిహోమం, ఆవాహిత మంటప దేవత ఆవాహనం, కలశస్థాపనం, మంటప దేవతాపూజ, కర్మరీస్థాపనం, ప్రతిష్ఠా హోమాలు, వేదపారాయణం, జలాధివాసం, హారతి మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణం చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

## వికాస్ ది కాన్సెప్ట్ స్కూల్‌లో ఉల్లాసస్య ఉత్సవం

**నిజాంపేట్, నవంబరు 23, ప్రభాతవార్త :**

బాచుపల్లి వికాస్ ది కాన్సెప్ట్ స్కూల్‌లో అంగరంగ వైభవంగా ఉల్లాసస్య ఉత్సవం.. ఆహ్వాన నృత్యంతో కనుల పండువగాసాగింది. లెఫ్టనెంట్‌గా నౌకాదళంలో పదవిని అధిరోహించి, తాను చదువుకున్న స్కూల్‌కి అతిథిగా ఆహ్వానాన్ని అందుకుని కల్లి జితేంద్ర రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు కల్లి దుర్గాకుమార్‌రెడ్డి, వైస్ ప్రిన్స్‌పాల్ శ్రీవేణి, ప్రైమరీ హెడ్ మిస్ట్రెస్ బిను అబ్రహం, కోఆర్డినేటర్ కనకరాజు, డైరెక్టర్ నందకిషోర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కల్లి జితేంద్ర రెడ్డి మాట్లాడుతూ తాను చదువుకున్న పాఠశాలకి అతిథిగా రావడం చాలా ఆనందంగా ఉన్నదని అన్నారు. తన తండ్రి తాను చదువుకునే రోజుల్లో ఫిజిక్స్ హెచ్ఓడిగా చేసేవారని, ఉపాధ్యాయుల శ్రద్ధ వల్ల మాలాంటివాళ్లు ఒక మంచి స్థాయికి చేరుకోగలుగుతామని, పట్టుదల కృషి ఉంటే మనం అనుకున్న గమ్యానికి చేరుకోవచ్చని అన్నారు. తనకు చదువు చెప్పి ప్రోత్సహించిన టీచర్స్ ముందు అతిథిగా ఇలా వచ్చి మాట్లా డటం నాకు చాలా ఆనందంగా ఉన్నదన్నారు. ఆభరణాల స్టాల్ మొదలు, అన్ని రకాల ఆహార పదార్థాలు, ఆటల స్టాల్స్ నుంచి ఆర్ట్ గ్యాలరీ నిర్వహించారు.



రైస్ మిల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆర్బిఎల్ సిఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి

## రైస్ మిల్లులతో రైతులకు మేలు

### ఆర్బిఎల్ సిఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి

**కుల్కచర్ల, నవంబరు 23, ప్రభాతవార్త:** ధాన్యం దిగుబడి ఉన్న ప్రాంతాల్లో రైస్ మిల్లులను నెలకొల్పడంతో ఈ ప్రాంత రైతులకు మేలు చేకురుతుందని ఆర్బిఎల్ సిఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కుల్కచర్ల మండల పరిధిలోని ఘణపూర్ గేట్ సమిపంలో తిర్మాలాపూర్ గ్రామాని చెందిన మహేశ్వరం రాములు గౌడ్ నిర్మించిన రైస్‌మిల్లును ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శివకూమార్ గౌడ్, వెంటయ్య, శ్రీనువాస్, శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో ఇందిరమ్మ చీరల పంపిణీ

**దోమ, నవంబరు 23 ప్రభాతవార్త:** ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ చీరలను మహిళలు అందరూ సద్వినియోగం యచేసుకోవాలని రాకొండ మాజి సర్పంచ్ చాపల వెంకటయ్య అన్నారు. ఆదివారం నాడు దోమ మండల పరిధిలోని రాకొండ, దోమ, అయినాపూర్, కొత్తపల్లి, బ్రాహ్మన్‌పల్లి, బోంపల్లి, గ్రామాలలో ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు పెద్దపీట వేసి అన్ని విధాలుగా అబివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని అన్నారు. పర్గి ఎమ్మెల్యే టి. రాంమోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలములోని అన్ని గ్రామాలలో మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమము చేటప్టడము జరుగుతుందని దోమ మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు విజయకుమార్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమములో రాకొండ మాజిసర్పంచులు చాపల లక్ష్మయ్య, వెంకటయ్య, రాకొండ గ్రామ కమిటి అద్యక్షులు మజ్జిగ వెంకటయ్య, ఇందిరమ్మ కమిటి సభ్యులు కొత్త చంద్రయ్య, చాపలశ్రీనివాస్, కొత్త అంజిలయ్య, పిల్లి వెంకటయ్య, బుక్‌కీపర్ కొత్తవెంకటయ్య, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.



చీరలు పంపిణీ చేస్తున్న మాజి సర్పంచ్ వెంకటయ్య

## కరాటే నేర్చుకోవడానికి విద్యార్థులు ముందుకు రావాలి

### మాజి జడ్‌పిటిసి లక్ష్మయ్య

**దోమ, నవంబరు 23 ప్రభాతవార్త:** విద్యార్థులందరు శారీరకంగా ఎదగడం ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చు కోవడానికి ముందుకు రావాలని దోమ మాజి జడ్‌పిటిసి లక్ష్మయ్య, మాజి సర్పంచ్ రాజిరెడ్డి అన్నారు. ఆదివారం నాడు దోమ మండల కేంద్రములోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో కరాటే విద్యార్థులకు కరాటే పత్రాలను అందజేశారు. గత మే నెలలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యములో మండలంలోని 121 మంది విద్యార్థులకు కరాటే శిక్షణ కార్యక్రమము నిర్వహించడము జరిగిందని తైక్వాండో కోచ్ రాములు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదివారం నాడు మండల కేంద్రములో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమములో దోమఎస్ఐ వసంత్, మండల కాంగ్రెస్‌పార్టీఅధ్యక్షులు విజయకుమార్‌రెడ్డి, మాస్టర్ మనోహర్, బుగ్గయ్య, నర్సిములు, శ్రీశైలం, అశోక్ పాల్గొన్నారు.



విద్యార్థులకు పత్రాన్ని అందిస్తున్న ఎస్ఐ వసంత్

## సిఎం గారు విన్నపాలు వినవలే...

**కొడంగల్, నవంబరు 23 ప్రభాతవార్త:** సీఎం గారు నేనండి కొడంగల్‌ను.. ఎక్కడో విసిరేసిన విస్తారులా కర్నాటక సరిహద్దులో గల నన్ను గతంలో ఎవ్వరు పట్టించుకున్న పాపాన పోలేదు. పైపెచ్చు రాష్ట్రంలో కొడంగల్ అని నా పేరు చెప్పగానే కళ్ళు చెమ్మగిల్లేలా ఓహో వరంగలా అంటూ అందరూ నన్ను ఎగతాళి చేసేవారు. అలాంటిది ప్రస్తుతం రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నా పేరు అదేనండి కొడంగల్ చెప్పగానే సకల మర్యాదలతో మారుమ్రోగుతోంది. అంతా మీ పుణ్యమేనండి. ఎందుకంటే ఇక్కడి నుంచి ప్రాతినిత్యం వహించిన ప్రజాప్రతినిధులకు ఇప్పటివరకు కనీసం మంత్రి పదవి కూడా వరించలేదు. అలాంటిది ప్రస్తుతం తమరు ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహిస్తు రాష్ట్ర ముఖ్యమంత్రి కావడం నా అదృష్టమండి. కాకపోతే ఎప్పుడు తమరు చెబుతుండేవారండి కొడంగల్‌ను మరో సిద్దిపేట, సిరిసిల్లా, గజ్వేల్, కుప్పం, పులివెందులా మారుస్తానని ప్రతి సమావేశాల్లో చెబు తుండేవారు. చెప్పినట్లుగానే రహదారుల రూపురేఖలు మారుతున్నాయనుకోండి, కానీ ఇంకా కావాల్సిన అభివృద్ధి చెప్పుకునేంత జరుగడం లేదండి. ఇక్కడి నుంచి వెళ్తున్న వలసలు నేటికి ఆగడం లేదండి. స్థానికంగానే ఉపాధి కల్పిస్తే కొంతవరకైనా వలసలు ఆగుతాయని చిన్న ఆశ. మరోపక్క తమరు అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తి అవుతున్నా నేటికి కొడంగల్ నారాయణపేట ఎత్తిపోతల పథకం పనులు అనుకున్న స్థాయిలో జరుగడం లేదండి. వర్షాధారంపై ఆధారపడే ఈ ప్రాంతానికి ఎత్తిపోతల పథకం ఎంతో అవసరమండి, మరోపక్క కొడంగల్‌కు కేటాయించిన మెడికల్ కాలేజీ, వెటర్నరీ కాలేజీలను మారుమూల గ్రామాలకు తరలిస్తే కొడంగల్ మళ్ళీ వెనుకబాటుకు గురైయ్యే ప్రమాదముంది. కనుక తమరు కొడంగల్‌లోనే మెడికల్ కళాశాల ఏర్పాటు అయ్యేలా తగు చర్యలు తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాను.

## ప్రజల భద్రతను బలోపేతం చేయడమే పోలీసుల కర్తవ్యం

### -మోమిన్ పేట సిఐ వెంకట్

**మోమిన్‌పేట్, నవంబరు 23, ప్రభాతవార్త :** ప్రజల భద్రత ను బలోపేతం చేయడమే పోలీసుల కర్తవ్యం అని సిఐ వెంకట్ తెలిపారు. ఆదివారం మోమిన్ పేట్ మండలం సిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మోమిన్ పేట పోలీసు సర్కిల్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్, అధిక బరువు, అతివేగంగా వాహనాలు నడపడం, సైలెన్సర్ మార్చి అదిక శబ్దం కాలుష్యం, వాహనాలపై ప్రత్యేక దృష్టి నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పోలీసులు నిర్వహిస్తున్న డ్రైవ్ ప్రజల భద్రత కోసమే అని అర్థం చేసుకొని సహకరించాలని ఆయన పేర్కొన్నారు. ప్రజల భద్రత కొరకు పోలీసులు నిరంతరం కృషి చేయడం జరుగుతుందని అన్నారు. మద్యం సేవించి వాహనం నడపడం ఒక తీవ్రమైన నేరం. అకస్మాత్తుగా జరిగే రోడ్డు ప్రమాదాలకు ఇదే ప్రధాన కారణం. డ్రంక్ ఆండ్ డ్రైవ్ పట్టుబడిన వారికి కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు. లైసెన్స్ సస్పెన్షన్ భారీ జరిమానాలు విధించడం, హైవేలు, ప్రధాన రహదారుల్లో ఆతి వేగంతో వాహనం నడిపే డ్రైవర్లపై ప్రత్యేక పర్యవేక్షణ, ద్విచక్ర వాహనం పై త్రిబుల్ రైడ్ వల్ల ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు త్రిబుల్ రైడ్ వేగ పరిమితిని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. సైలెన్సర్ ు తొలగించి అధిక శబ్దం వచ్చే విధంగా మార్చిన బైక్‌లు, ప్రెజర్ హార్న్‌లు వాడితే కఠిన చర్యలు ఉంటాయని, ఈ శబ్దం వృద్ధులు, పిల్లలు, రోగులకు ఇబ్బందులు కలిగించడంతో పాటు శాంతి భద్రతలకు భంగం కలిగిస్తుందన్నారు. ఇలాంటి వాహనాల ు పబ్లిక్ ప్లేసుల్లో గుర్తించి వాహనాల ు సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామన్నారు. పై విషయంలో ఎలాంటి ఇబ్బంది కలిగిన సంబంధిత పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని, ఏ విధమైన సైబర్ క్రైమ్‌కు గురి అయిన 1930, నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని సిఐ వెంకట్ తెలిపారు.



సిఐ వెంకట్

# నేడు కొడంగల్‌లో సిఎం పర్యటన

- 3గంటలకు హెలికాప్టర్‌లో చేరుకోనున్న సీఎం
- హరేక్రిష్ణ మూవ్‌మెంట్ ట్రస్ట్ కిచన్‌షెడ్ పరిశీలన
- అక్షయపాత్ర ఫౌండేషన్ మధ్యాహ్న భోజన షెడ్‌కు శంకుస్థాపన
- రూ.110కోట్ల అభివృద్ధి పనులకు భూమిపూజ
- బహిరంగ సభలో ప్రసంగించనున్న ప్రసంగం
- సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్‌లు, ఎస్పీ

**కొడంగల్, నవంబరు 23, ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి సోమవారం కొడంగల పర్యటన ఖరారైంది. మధ్యాహ్నం 3:30 గంటలకు హెలిక్యాప్టర్‌లో కొడంగల్‌కు చేరుకోనున్నారు. అక్కడి నుంచి నేరుగా కొడంగల్ పట్టణంలోని మార్కెట్‌యార్డులోని హరేక్రిష్ణ మూవ్‌మెంట్ అల్పాహార కిచన్‌షెడ్‌కు చేరుకో నున్నారు. అక్కడే కిచన్‌షెడ్‌ను పరిశీలించిన అనంతరం ఎన్కెపల్లి రోడ్డులోని అక్షయపాత్ర ఫౌండేషన్ మధ్యాహ్న భోజన షెడ్‌కు సిఎం శంకుస్థాపన చేయనున్నారు. అలాగే నియోజకవర్గంలోని 8 మండలాలకు సంబంధించి పలు అభివృద్ధి శిలాఫలకాలు ప్రారంభిస్తారు. ఇందులో పంచాయతీరాజ్‌శాఖకు సంబంధించి రూ.29.67కోట్ల పనులు, రూ.3.65 కోట్ల బంజార భవనం పనులు, ఎక్సైజ్ కార్యాలయ నిర్మాణంకు రూ.1కోటి, అగ్ని మాపకశాఖ భవనానికి రూ.1.3కోట్లు, బొంరాస్‌పేట్‌లో గ్రంథాలయ భవనానికి రూ.64లక్షల, హకీంపేటలో అర్‌అండ్‌బి అతిథి గృహానికి రూ.5కోట్లు, లాహోటీ కాలనీ నుంచి బాపల్లి రోడ్డు విస్తరణకు సంభందించి రూ.60కోట్లు, వ్యవసాయ మార్కెట్‌యార్డు అభివృద్ధికి కోస్గీకి సంభందించి రూ.4.5కోట్ల పనులు చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఆయా పనులు అన్నింటికి శిలాఫలకాలను సిఎం ప్రారంబిస్తారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేయనున్న బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. అనంతరం హెలిక్యాప్టర్‌లో సిఎం హైద్రాబాద్‌కు తరలివెళ్ళనున్నట్లు అధికారులు తెలిపారు. సిఎం పర్య టన నేపథ్యంలో ఆదివారం వికారాబాద్, నారాయణపేట్ జిల్లాల కలె క్టర్‌లు ప్రతీక్‌జైన్, సిక్తా పట్నాయక్, జిల్లా ఎస్పీ స్నేహ మెహం, సిఎంఓ అధికారి వాసుదేవ రెడ్డిలు సీఎం పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించారు. హెలిప్యాడ్, అక్షయపాత్ర అల్పాహారం సెంటర్ బహిరంగ సభ స్టేజీ ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పూర్తి బందోబస్తు ఎలాంటి సమస్యలు రాకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా నిరంతర విద్యుత్ సరఫరా, రెండు అంబులెన్స్‌లు, వైద్య సౌకర్యాలు అన్నింటిని ఏర్పాటు చేయాలని సంభంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. శానిటేషన్, బారికేడ్స్, మొబైల్ టైయిలెట్స్, త్రాగునీరు, స్టేజి ఏర్పాట్లు, వివిపి పార్కింగ్ పూర్తి ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. పోలీస్ శాఖ బందోబస్తు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలన్నారు. ముందు జాగ్రత్తగా ఫైర్ ఇంజన్‌ను ఏర్పాటు చేయాలని అన్నారు. కలెక్టర్‌తో పాటు ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ, విద్యుత, వైద్యశాఖ, ఇతరాత్ర శాఖల అధికారులతో పాటు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు నందారం ప్రశాంత్, మున్సిపల్ కమీషనర్ బలరాంనాయక్, తహాశీల్దార్ రాంబాబు, సంభందిత అధికారులు తదితరులు ఉన్నారు. కాగా కొడంగల్‌తో పాటు దుద్యాల మండలంలోని లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి ప్రాంతాల్లో ఎడ్యుకేషన్ హబ్‌కు సిఎం శంకుస్థాపన కార్యక్రమం రద్దైయినట్లు సమాచారం.



సిఎం పర్యటన ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్



బహిరంగ సభా స్థల ఏర్పాట్లు

## మలుపులు.. యమపురి పిలుపులు..

**మోమిన్‌పేట్, నవంబరు 23, ప్రభాతవార్త :** మోమిన్ పేట్ మండలంలోని వెల్చాల్, మొరంగపల్లి రైల్వేస్టేషన్ పరిధిలో గల ప్రధాన రహదారి మూలమలుపులు ప్రమాదకరంగా ఉండడంతో ఇదివరకే ఈ మూలమలుపుల వద్ద ప్రయాణికులు అక్కడికక్కడే మృతిచెందిన సంఘటనలు అనేకం ఉన్నాయి. కనీసం సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడంతో మూలమలుపుల వద్ద ప్రయాణికులు ఎదురెదురుగా ఢీకొన్నంతవరకు ఏమీ తెలియదు. పైగా రోడ్డుకిరువైపులా ఏపుగా పెరిగిన చెట్లు ఉండటంతో ప్రమాదాలకు నిలయాలుగా ఉన్నాయి. ఈ మూలమలుపుతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సూచిక బోర్డులు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్కడ అధికారులు ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయనందువలన తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మలుపుల వద్ద ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలు తొలగించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న మూల మలుపు

## కలెక్టరేట్‌లో శ్రీసత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలు

### ..జ్యోతిప్రజ్వలన చేసిన..డిఆర్ఓ హరిప్రియ



కలెక్టరేట్‌లో భగవాన్ శ్రీసత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలు నిర్వహించి పాల్గొన్న డిఆర్ఓ హరిప్రియ, డివైఎస్ఓ దామోదర్‌రెడ్డి, తదితరుల దృశ్యం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబరు 23, ప్రభాతవార్త :** మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో భగవాన్ శ్రీసత్యసాయిబాబ శత జయంతి ఉత్సవాలను అధికారికంగ నిర్వహించారు. ఆదివారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు భగవాన్ శ్రీసత్యసాయిబాబ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. దీనిలో జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్ఓ) హరిప్రియ పాల్గొని భగవాన్ శ్రీసత్యసాయిబాబ చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. జిల్లా యువజన, క్రీడల అధికారి వై. దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో భగవాన్ శ్రీసత్యసాయి జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ హరిప్రియతో పాటు జిల్లా యువజన, క్రీడల అధికారి దామోదర్‌రెడ్డి, జిల్లా అధికారులు, కేలో ఇండియా సైకిల్ సిబ్బంది, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



ఎమ్మెల్యే శంకర్ కు జ్ఞాపకం అందజేస్తున్న స్థానికులు

### సత్యసాయి అడుగు జాడల్లో అందరూ నడవాలి....

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్‌నగర్, నవంబరు 23, ప్రభాతవార్త :** ప్రపంచానికే సత్యసాయి బాబా ఆదర్శమని ఆయన అడుగు జాడల్లో అందరూ నడిస్తే సమాజంలో శాంతి నెలకొంటుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొని చిన్నారులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సత్యసాయి సేవాసమితికి చెందిన శ్రీనివాస్ రెడ్డి, వెంకటయ్య, సరాపు జగదీశ్వర్ లు శాలువాతో సత్కరించి స్వామి చిత్రపటాన్ని అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోని 186 దేశాల్లో స్వామి భక్తులు ఉండడం గొప్ప విషయమన్నారు. ఉచిత విద్య, ఉచిత చదువు అందించడం స్వామికే సాధ్యమైందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాబర్, విశ్వం, బస్వం, బాల రాజగౌడ్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



చిన్నారితో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

### అంగరంగ వైభవంగా భగవాన్ సత్యసాయి బాబా "శత జయంతి" వేడుకలు

### కాశీ విశ్వనాథ భాగవతార్‌చే సత్యసాయి దివ్య చరిత్ర ప్రవచనం

**షాద్‌నగర్ టౌన్, నవంబరు 23, ప్రభాతవార్త :** భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శత జయంతి వేడుకలు పట్టణంలోని పరిగి రోడ్డులో గల సత్యసాయి సేవా మందిరంలో అంగ రంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదివారం తెల్లవారుజామున మహా నగర సంకీర్తన, అనంతరం మహా రుద్రాభిషేకం, గద్వాల పట్టణానికి చెందిన కాశీ విశ్వనాథ భాగవతార్ చే సత్యసాయి దివ్య చరిత్ర ప్రవచనం నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ గావించారు. సాయంత్రం మహా భజన, మహిళలచే స్వామి వారికి ఊయల సేవ, చిన్నారులచే కేక్ కటింగ్, మహా మంగళహారతి కార్యక్రమాలు ఉంటాయని సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కే. శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, విశ్వహిందు పరిషత్ రాష్ట్ర కార్యదర్శి బండారి రమేష్, మునిసిపల్ మాజీ చైర్మన్ కే. నరేందర్, పట్టణ ప్రముఖులు బెజగం రమేష్, సరాపు జగదీశ్వర్, సమితి గౌరవ అధ్యక్షులు ఎం. వెంకటయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సత్యసాయి శత జయంతి వేడుకల్లో పాల్గొన్న భక్తులు



ఎంపీ రవిచంద్ర, ఎమ్మెల్యే మల్లారెడ్డిలకు బ్రహ్మోత్సవ ఆహ్వానం అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

## శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ రజతోత్సవాల ఆహ్వానం

### -ఎంపీ రవిచంద్రకు సన్మానం

**ఘట్‌కేసర్, నవంబరు 23, ప్రభాతవార్త:** బిఆర్ఎస్‌పార్టీ పార్లమెంటరీపార్టీ ఉపనేత–రాజ్యసభసభ్యులు వద్దిరాజు రవిచంద్రను శ్రీభూసమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు శాలువా కప్పి సన్మానించారు. ఘట్‌కేసర్ బాలాజీనగర్‌లో కొలువైన శ్రీభూసమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ రజితోత్సవం సందర్భంగా ఈనెల 25 నుంచి 30వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఈమేరకు ఎంపి వద్దిరాజు రవిచంద్ర, మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డిలను ఆలయకమిటీ సభ్యులు కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. శ్రీమద్భగవద్గీతా భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీసదానందయోగీశ్వరులు (చింతపండు సంజీవయ్య) ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిం చేందుకు ఏర్పాట్లు చేశారని తెలిపారు. బ్రహ్మోత్సవాలకు విచ్చే యాలని వారు ఎంపి, ఎమ్మెల్యేను కోరారు. ఆలయ కమిటీ సభ్యులు చింతపండు జ్ఞానేశ్వర్, ఎం. వెంకటేశ్, బి. నగేశ్‌కుమార్, రేసు లక్ష్మారెడ్డి, ఎం. హరగోపాల్, కోవ రామ్మోహన్, ఎం. రాజ్ కుమార్, వాసాల వెంకటేశ్వర్లు, వెంకన్న, విజయ్‌లు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌లో ఒంటికాలుపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న సిఐటియు నాయకులు

## లేబర్‌కోడ్‌ల అమలు నోటిఫికేషన్ ఉపసంహరించుకోవాలి

### -సిఐటియు నాయకులు యాదయ్య, సబిత డిమాండ్

**ఘట్‌కేసర్, నవంబరు 23, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 4 లేబర్‌కోడ్‌ల అమలు కోసం విడుదల చేసిన నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు చింతల యాదయ్య, మండల నాయకురాలు ఎన్. సబితలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఘట్‌కేసర్ మున్సిపల్ పాపన్న చౌరస్తాలో సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు ఒంటికాలుపై నిలబడి నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం భీమా, టెలికాం, బ్యాంకింగ్ రంగాలలో ప్రైవేట్ పెట్టుబడులకు అవకాశం ఇచ్చి ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తుందని వారు విమర్శించారు. కార్పొరేట్ ప్రయోజనాల కోసం కార్మికుల శ్రమ గంటలను పెంచుతూ యూనియన్లు ఏర్పాటు చేసుకునే హక్కును, సమ్మె చేసే హక్కును ప్రశ్నార్థకం చేస్తూ యాజమాన్యాలకు అనుకూలంగా చట్టాలను పొందుపరచి కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చే విధంగా లేబర్‌కోట్స్ తీసుకువచ్చారని ఈసమస్య కార్మికులకు నష్టం చేసేలా లేబర్‌కోడ్‌లు ఉన్నాయని వీటిని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్మికులు లేబర్‌కోడ్స్‌కు వ్యతిరేకంగా భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక నాయకులు నాగరాజు, శ్రీనివాస్, కర్రె రాజిరెడ్డి, సత్తమ్మ, ఎల్లమ్మ, సురేశ్, శ్రీరామ్, జయ, అచ్చయ్య, విజయ తదితరులు పాల్గొన్నారు.

## వైద్యం ముసుగులో దోపిడీ అరికట్టాలి

### అబాబిల్ ఫౌండేషన్ వైద్య సేవలను ప్రశంసించిన ఎమ్మెల్యే శంకర్

**షాద్‌నగర్, నవంబరు 23, ప్రభాతవార్త :** పేద ప్రజలకు వైద్యం అందించే పేరు మీద దోపిడీ చేయడం తగదని చాలామంది అవసరం లేని వైద్య పరీక్షలు చేస్తూ వైద్యం ముసుగులో పేద ప్రజలను ఆర్థికంగా పట్టిపీడిస్తున్నారని ఈ నేపథ్యంలో పేద ప్రజలను వైద్య పరంగా ఆదుకునేందుకు "అబాబిల్ ఫౌండేషన్" ముందుకు రావడం గొప్ప విషయమని షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం షాద్ నగర్ పట్టణంలోని నెహ్రూ కాలనీలో గల శివ ఫంక్షన్ హాల్లో "అబాబిల్ ఫౌండేషన్" ఆధ్వర్యంలో స్థానిక ఫౌండేషన్ నిర్వాహకులు మొహమ్మద్ హఫీజ్ అన్వర్, సయ్యద్ ఇర్ఫాన్, మొహమ్మద్ సాధక్, మహమ్మద్ నవాజ్ క్రిస్టియన్, ఖాలెత్ ఖాన్, అజహర్ నేత్రుత్వంలో ఉచిత వైద్య ఆరోగ్య మెగా హెల్త్ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ మైనార్టీ నేత జమృత్ ఖాన్ చేతుల మీదుగా ప్రారంభించారు. వైద్య శిబిరంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్వయంగా బిపి షుగర్ పరీక్షలను ఉచితంగా చేయించుకున్నారు. అనంతరం కార్యక్రమాన్ని ప్రారంభించి పేద ప్రజలకు వైద్య పరీక్షల అనంతరం వారికి ఉచిత మందులను పంపిణీ చేశారు. అనవసరమైన వైద్య పరీక్షలు వద్దుఅనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రులకు వెళితే షాద్ నగర్ లో చాలాచోట్ల అవసరం లేని వైద్య పరీక్షలు నిర్వహించి ఆర్థికంగా వారిని పట్టిపీడిస్తున్నారని ఎమ్మెల్యే శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న మోకాలు నొప్పి అని వెళ్లినా కూడా అవసరం లేని పరీక్షలు అన్నీ రాసి వారిని పంపిస్తున్నారని తద్వారా 10 నుండి 15 వేల వరకు వృథాగా వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారని దీనివల్ల ఎంతో మంది నిరుపేదలు దోపిడీకి గురవుతున్నారని ఎమ్మెల్యే ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వైద్య విధానం మారాలని పేద ప్రజలకు అవసరమైన వైద్యమే లభించాలని ఆయన ఆశించారు. మానవసేవే మాధవసేవ అన్న విషయాన్ని వైద్యులు గుర్తురెగాలని మానవుని సేవల పరంగా సేవిస్తే ఎంతో పుణ్యం వస్తుందని అనవసరంగా వారిలో అనారోగ్యం పేరిట ఆందోళన రేకెత్తించి డబ్బు చేసుకోవడం సబబు కాదని ఎమ్మెల్యే సూచించారు. రోగాలు వచ్చాక బాధపడే కంటే అవి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే ప్రజలకు సూచించారు. సమాజంలో వైద్యం అంటే ఎంతో ఖరీదైనదిగా మారిపోతుందని ఇలాంటి పరిస్థితుల్లో అబాబిల్ ఫౌండేషన్ నిర్వాహకులు ముందుకు వచ్చి ఆర్థికంగా పేద ప్రజలకు చేయూతను అందించే విధంగా ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయడం విశేషం అన్నారు. ఇలాంటి శిబిరాలకు నా వంతు సహకారం అందిస్తాపేద ప్రజలకు ఎలాంటి స్వార్థం లేకుండా నయా పైసా ఆశించకుండా ఉచితంగా వైద్యం అందించడం లాంటి సేవా కార్యక్రమాలకు తన వంతు ప్రభుత్వ సహాయ సహకారాలు ఉంటాయని అదేవిధంగా నా వంతు సహకారం కూడా అవసరమైతే ఆర్థికంగా అందిస్తానని ఎమ్మెల్యే శంకర్ సూచించారు. అవాబిల్ ఫౌండేషన్ నిర్వాహకులతో ఆయన మాట్లాడుతూ.. ప్రతి మూడు నెలలకు ఒకసారి కచ్చితంగా షాద్ నగర్ ప్రాంతంలోఅబాబిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించాలని తనవంతు ఆర్థిక సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే శంకర్ ను సన్మానించిన అబాబిల్ ఫౌండేషన్.. ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను అబాబిల్ ఫౌండేషన్ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. అబాబిల్ ఫౌండేషన్ ద్వారా హైదరాబాద్ లో అనేక ఆసుపత్రుల్లో పనిచేస్తున్న వివిధ విభాగాలకు సంబంధించిన వైద్యులు తమను సేవా కార్యక్రమాల వైపు ప్రోత్సహించడం ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు విచ్చేసిన ఎమ్మెల్యేను వారు అభినందిస్తూ వారిని శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే శంకర్ సూచనలను తూచా తప్పకుండా పాటిస్తామని భవిష్యత్తులో మరిన్ని ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలను పేద ప్రజలకు అందిస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీఖాన్ బాబర్, స్థానిక మాజీ కౌన్సిలర్ ఎండి సర్వర్ పాషా, అగ్గనూరు బస్వం, మైనార్టీ నేతలు జమృత్ ఖాన్, అసద్ భాయ్, మహమ్మద్ ఇబ్రహీం, కాంగ్రెస్ సీనియర్ నేతలు చెన్నయ్య, కృష్ణారెడ్డి, మనీష్ బబ్లూ, శర్ఫోద్దీను, అక్బర్ భాయ్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్